క్లుప్తంగా

అమ్మవారికి ఊయల సేవ

శ్రీశైలం టెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన భ్రమరాంబ దేవికి శుక్రవారం దేవస్థాన అర్చకులు ఊయలసేవ నిర్వహించారు. ముందుగా సేవసంకల్పాన్ని పఠించారు. మహాగణపతిపూజ చేశారు. ఊయలను స్వామి, అమ్మవార్లను ఆశీనులను చేసి ప్రత్యేక పూజల అనంతరం అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైలంలోని అంకాలమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహానందీశ్వరుడికి రైల్వే ఏజీఎం పూజలు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో సౌత్ సెంట్రల్ రైల్వే అడిషనల్ జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్, కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి స్వాగతం పలకగా వారు కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం తర్వాత వారికి స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

భక్తుల నిజాయతీ

మహానంది: మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన బెంగళూరు భక్తులు నిజాయతీ చాటుకున్నారు. కర్ణాటక రాష్ట్రం రంగంపేట్‌కు చెందిన రాజేశ్వరి, కుటుంబ సభ్యులు శుక్రవారం మహానందికి వచ్చారు. చిన్నకోనేరు వద్ద ఆమె తన 10 గ్రాముల తాళిబొట్టు గొలుసు పోగొట్టుకోగా బెంగళూరుకు చెందిన భక్తులకు దొరికింది. వారు హోంగార్డు కోటయ్యకు అందజేయగా ఆయన ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మైకుల్లో అనౌన్స్ చేయించి బాధితులిని పిలిపించి అప్పగించారు. నిజాయతీ చాటుకున్న భక్తులను అధికారులు, బాధితులు అభినందించారు.

ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పకోవద్దు

నందికొట్కూరు: సమస్యలు పరిష్కరించకుండా ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని ఎమ్మెల్యే జయసూర్య అధికారులకు సూచించారు.శుక్రవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం వద్ద నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజాఫిర్యాదులను ఎమ్మెల్యే స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా త్వరితగతిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రీవెన్స్‌లో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శర్మ, విద్యుత్ డీఈఈ శ్రీనివాసులు, ఐసీడీఎస్ సీడీపీఓ కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

తాగు నీరు వెంట ఉంచుకోవాలి



మస్టర్ రోల్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాములపాడు: ఉపాధి కూలీలు పని ప్రదేశానికి వెంట తాగు నీరు తెచ్చుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరును, మస్టర్ రోల్‌ను పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రమాదాల భారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

స్పౌజ్ పింఛన్‌కు దరఖాస్తు చేసుకోండి

పాములపాడు: స్పౌజ్ పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పింఛన్ పొందుతూ 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31లోపు మరణించిన భర్తల భార్యలు మాత్రమే అర్హులన్నారు. సచివాలయాల్లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పంచాయతీ కార్మికులకు సన్మానం



కార్మికులను సన్మానిస్తున్న సర్పంచ్ వేల్పుల జైపాల్, అధికారులు

వెలుగోడు: పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పంచాయతీ కార్మికులను అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల జైపాల్, ఈఓఆర్‌డీ మురారి, ఈఓ సుంకన్న పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

నంద్యాల(న్యూటౌన్): స్థానిక శ్రీరామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కేజీబీవీ సుబ్బయ్య తెలిపారు. శుక్రవారం ఆయన ఆయన మాట్లాడుతూ పట్టణ పరిసర ప్రాంతాల నిరుద్యోగ విద్యార్థులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ, టాటాట్రెండ్, పేటీఎం, తదితర 8 బహుళజాతి కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంటెక్, ఫార్మ నర్సింగ్‌లలో 2018 నుంచి 2024 వరకు విద్యార్హత పొందిన వారు అర్హులన్నారు.

ఉగ్రవాదాన్ని అణచివేయాలి

- కశ్మీర్ మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని కొవ్వత్తుల ర్యాలీ

ఉగ్రవాదాన్ని అణచివేయాలని పలువురు వక్తలు ముక్తకంఠంతో నినదించారు. కశ్మీర్ మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని శుక్రవారం శ్రీశైలం, నందికొట్కూర్ నియోజకవర్గాల్లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మృతులకు నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఆత్మకూరు: జమ్మూకశ్మీర్ మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ ఆత్మకూరులో శుక్రవారం రాత్రి ముస్లింలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కొత్తపేట మసీదు నుంచి నంద్యాల టర్నింగ్ మీదుగా గౌడ్ సెంటర్ వరకు చేరుకుని అక్కడ మృతులకు సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు సయ్యద్‌మీర్, ఇస్మాయిల్, ముక్తి నూర్‌మహమ్మద్, రహంతుల్లా,అల్తాఫ్‌హుసేన్, ముర్తుజా, అబ్దుల్‌సలాం, మొమిన్‌ముస్తఫా, అంజాద్ తదితరులు పాల్గొన్నారు. యూటీఎఫ్ ఆత్మకూరు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సాయిప్రసాద్, శ్రీనివాసులు,రమణ, శంకర్‌రెడ్డి,నిజాముద్దీన్,వెంకటస్వామి,పుల్లన్న పాల్గొన్నారు.

- ఆత్మకూరు మండలంలోని ముష్టపల్లె గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తు ర్యాలీ నిర్వహించారు. జమ్మూకశ్మీర్‌లో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతున్న పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి 26 మందిని పొట్టన పెట్టుకున్న తీవ్రవాదులను అంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి బాషపోగుల దరగ్య మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బుజ్జి మాదిగ, జిల్లా ప్రచార కార్యదర్శి కాటెపోగు నాగయ్య మాదిగల తదితరులు డిమాండ్ చేశారు. మృతుల ఆత్మలకు శాంతి కలగాలని, దాడిలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.





ముష్టపల్లెలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం ఆత్మకూరులో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

మహానంది: జమ్ము కశ్మీర్‌లోని పహల్గామ్‌లో అమాయక టూరిస్టులపై దాడి చేసిన వారిని అంతమొందిస్తేనే వారి ఆత్మకు శాంతి కలుగుతుందని విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు రామయ్య అన్నారు. అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డు గ్రహీత జి.రామకృష్ణుడు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం మహానందిలో ర్యాలీ నిర్వహించిన అనంతరం రాత్రి ఏడు గంటలకు కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. విశ్వహిందూ పరిషత్ నాయకులు రాజశేఖరరెడ్డి, వెంకటసుబ్బయ్య, లక్కాకుల చిన్న కాశయ్య, ఆర్ఎస్ఎస్ నేతలు భూమా గోపాలకృష్ణ, ఆర్యవైశ్య మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న హిందూ సంఘాల నాయకులు, మహిళలు

బండిఆత్మకూరు: కశ్మీర్ ఉగ్ర దాడిని ఖండిస్తూ బండిఆత్మకూరులో శుక్రవారం సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు రత్నమయ్య మాట్లాడుతూ బాధ్యులైన వారిని శిక్షించే క్రమంలో భారత జాతి మొత్తం ఏకతాటిపై నిలవాలన్నారు.

నందికొట్కూరు: ఉగ్రదాడిలో చనిపోయిన వారి ఆత్మలకు శాంతి కలగాలని సీపీఎం నాయకులు శుక్రవారం పట్టణంలోని కేజీ రోడ్డుపై కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, ఉస్మాన్‌బాషా, బాబు, షాజిదాబి, రంగమ్మ, జయరాణి, శేఖర్, శివ, శంకర్, వెంకటేశ్వర్లు, మహేష్, సురేష్, రాము పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న నాయకులు

సంగమేశ్వరుడికి జేసీ పూజలు



వేపధారు శివలింగాన్ని దర్శించుకుంటున్న జేసీ, కుటుంబ సభ్యులు

కొత్తపల్లి: పవిత్ర పుణ్యక్షేత్రం సప్తనది సంగమేశ్వరాలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ ఆయన తల్లిదండ్రులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలోని వేపధారు శివలింగానికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం జేసీ విష్ణుచరణ్ సంగమేశ్వర పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పురోహితులు ఆలయ చరిత్రను ఆయనకు వివరించారు.

ఆహ్వానం



పోలీసు అధికారులకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న స్పోర్ట్ క్లబ్ సభ్యులు

ఆత్మకూరు: పట్టణంలో శనివారం జరిగే ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌కి హాజరుకావాలని డీఎస్పీ రామాంజినాయక్, రూరల్‌సీఐ సురేష్‌కుమార్‌రెడ్డిలకు ఆత్మకూరు స్పోర్ట్ క్లబ్ సభ్యులు ఆహ్వానించారు. శుక్రవారం వారు డీఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులకు ఆహ్వాన పత్రికను అందించారు.

పండ్లతోటల పెంపకంలో రైతులకు సూచనలివ్వాలి



మాట్లాడుతున్న ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రవి

ఆత్మకూరు: పండ్లతోటల పెంపకంలో రైతులకు సూచనలివ్వాలని హార్టికల్చర్ ఆఫీసర్ చందన, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రవి, ఏపీఓ మనోహర్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.వి.సుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఉపాధి, వ్యవసాయశాఖ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసక్తి ఉన్న రైతులకు ఎంజీఎన్ఆర్ఈజీఏస్‌లో మామిడి, నిమ్మ, సీతాఫలం, దానిమ్మ, సపోటా, జామ, కొబ్బరి, నేరేడు, అంజీర, రేగు మొక్కలు ఎకరా నుంచి ఐదు ఎకరాల్లో నాటుకునేందుకు అందజేస్తామన్నారు. ఎకరాలో మల్లె, గులాబీ, పూలతోటలు, మునగ మొక్కలు ఇస్తామన్నారు.

మలేరియాను నిర్లక్ష్యం చేయొద్దు

మహానంది: మలేరియా జ్వరాలను ఏ మాత్రం నిర్లక్ష్యం చేయవద్దని తిమ్మాపురం పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈఓ హుసేన్‌రెడ్డి కోరారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం తిమ్మాపురంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ కొన్ని సార్లు మలేరియా ప్రాణాంతకం కావచ్చన్నారు. మలేరియా లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు.



తిమ్మాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

మహానందీశుడి దంపతులకు పల్లకీసేవ

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఆలయ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వర శర్మ, అర్చకులు శరభయ్యశర్మ స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, హారతులు, బలిహరణ పూజల అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకోత్సవం కనులపండువగా జరగగా పలు ప్రాంతాల భక్తులు దర్శించారు.



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మల్లన్న సేవలో ప్రముఖులు

శ్రీశైలం టెంపుల్: భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను శుక్రవారం రాజస్తాన్ ఐఏఎస్ అధికారి ఆర్‌సీఏ మల్లిక్, ఎంఓఆర్‌డీ సెక్రటరీ అద్రిజా మంజారీ సింగ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వారికి ఆలయ రాజగోపురం వద్ద ఈఓ ఎం శ్రీనివాసరావు, అర్చకులు, వేదపండితులు స్వాగతం పలికారు. భ్రమరాంబదేవికి కుంకుమార్చన, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద ఆశీర్వాచ మండపంలో వేదపండితులు వేదమంత్రాలు పలకగా అర్చకులు ఆశీర్వాచనాలు అందించారు.

కోలుకోలేక వృద్ధుడి మృతి

రుద్రవరం: ఆత్మహత్యకు యత్నించిన టి.లింగదిన్నెకు చెందిన ఓబన్న(77) కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఇతను కొంత కాలంగా దగ్గు, ఆయాసంతో బాధపడేవాడు. చికిత్స చేయించుకున్నా తగ్గకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై గురువారం ఇంట్లో పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ కోలుకోలేక ప్రాణాలు విడిచినట్లు పోలీసులు తెలిపారు.

మహానందిలో కొనసాగుతున్న భక్తుల సందడి

మహానంది: మహానందిలో శుక్రవారం భక్తుల సందడి నెలకొంది. సెలవులు ఉండటంతో వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వారి ఆలయాలతో పాటు కోదండరామాలయం, ఆంజనేయస్వామి ఆలయాలను సందర్శించి ఆలయ ప్రాంగణంలో ఉన్న రాతినంది, పెద్దనంది విగ్రహాలను తిలకించారు.

మహానందీశ్వరుడి దంపతులకు కల్యాణం

మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు శుక్రవారం కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో అర్చకులు స్వామి, అమ్మవారిని విశేషంగా అలంకరించి ఆలయ కల్యాణమండపంలో కల్యాణాన్ని నిర్వహించారు.



కోనేరులో భక్తుల పుణ్యస్నానాలు

తప్పిపోయిన యువతి

- పోలీసుల సాయంతో కుటుంబ సభ్యుల చెంతకు

ఆత్మకూరు: పాములపాడు గ్రామానికి చెందిన సావిత్రమ్మ కుటుంబ సభ్యులతో కలిసి పెళ్లికొడుకుకు సంబంధించిన దుస్తులు కొనడానికి శుక్రవారం ఆత్మకూరుకు వచ్చారు. వారు దుస్తులు కొనుగోలు చేస్తుండగా ఆమె కోడలు సుమిత్ర(ఒరిస్సాకు చెందిన యువతి) దుకాణం గుర్తించలేక తప్పిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే టౌన్ పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. సీఐ రాము ఆదేశాలతో కానిస్టేబ్లు రవికుమార్, శ్రీనివాసులు షాపింగ్ చేసిన ప్రాంతాల్లో తనిఖీలు చేసి సుమిత్రను గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా సీఐకు, కానిస్టేబుళ్లకు సావిత్రమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



తప్పిపోయిన యువతిని అప్పగిస్తున్న పోలీసులు

వాహనాల తనిఖీ



వాహననాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ జయశేఖర్

కొత్తపల్లి: మండల కేంద్రం సమీపంలో శుక్రవారం ఎస్ఐ జయశేఖర్ వాహనాల తనిఖీ చేపట్టారు. లైసెన్స్, సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు రోడ్లపై తిప్పరాదని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని ఎస్ఐ వాహనదారులకు సూచించారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడుపుతున్న 15 మందికి రూ.2,800 జరిమానా విధించారు.

మే డేను జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

నందికొట్కూరు: పట్టణంలో జరిగే మే డేను కార్మికులు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రఘురామమూర్తి కోరారు. శుక్రవారం జైకిసాన్ పార్కులో మే డే కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కార్మికులు పిడికిలి బిగించి కార్మిక హక్కుల రక్షణ కోసం ఉద్యమించాలన్నారు. వచ్చే నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. పోరాడి సాధించుకున్న హక్కులు, సంక్షేమ పథకాలు కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికులందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగేంద్ర, నాగేశ్వరరావు, శివ, శంకర్ నాయుడు, ప్రతాప్, గోవింద్‌గౌడ్ పాల్గొన్నారు.

అభ్యంతరాలు ఉంటే అర్జీ ఇవ్వండి

పగిద్యాల: సమగ్ర భూ సర్వేలో పొలం విస్తీర్ణం కొలతలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెలాఖరులోగా తెలియజేయాలని తహసీల్దార్ శివరాముడు, సర్వే డిప్యూటీ తహసీల్దార్ మురళీ రైతులకు సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో వారు మాట్లాడారు. రీ సర్వేలో నమోదైన కొలతలు, రిజిష్టర్ కాగితాల్లో నమోదైన కొలతలను సరి చూసుకుని వ్యత్యాసం ఉంటే అర్జీ అందజేయాలన్నారు. సభలో డిప్యూటీ తహసీల్దార్ మధు, ఆర్ఐ శ్రీరంగారెడ్డి, వీఆర్వో నాగన్న పాల్గొన్నారు.

భక్తి హృదయాన్ని పవిత్రంగా మార్చుతుంది



భక్తి ప్రవచనాలు బోధిస్తున్న డాక్టర్ మల్లు వెంకటరెడ్డి



కుంకుమార్చనలో భక్తులు

నందికొట్కూరు: భక్తి హృదయాన్ని పవిత్రంగా మార్చుతుందని ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. కోటా వీధిలోని వీరభద్ర స్వామి గుడిలో నాలుగు రోజులుగా జరుగుతున్న తిరుమల తిరుపతి దేవస్థానం ధార్మిక అధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ధర్మ ప్రచార మండలి సభ్యులు అంబటి శివశంకర్‌రెడ్డి, అర్చకులు గురుబసయ్య, మంజునాథ్, ఆలయ కమిటీ అధ్యక్షులు సాపూరు శంకరప్ప, మహిళా మండలి అధ్యక్షురాలు పార్వతమ్మ, వ్యవస్థాపక అధ్యురాలు కాళ్లూరు లక్ష్మి, స్కాలరు స్కూల్ కరస్పాండెంట్ శివప్రసాద్ పాల్గొన్నారు.

మస్టర్లలో తప్పలకు ఆస్కారం ఇవ్వొద్దు

కొత్తపల్లి: ఉపాధి హామీ పథకం పనుల వద్ద కూలీలకు వేసే ఆన్‌లైన్, మాన్యువల్ మస్టర్లు వేయడంలో మేటీలు తప్పులు దొర్లకుండా చూసుకోవాలని ఏపీఓ విమలమ్మ సూచించారు. శుక్రవారం మండలంలో జి.వీరాపురం గ్రామ సమీపంలో ఉపాధి కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనికి వచ్చిన వారికి మాత్రమే మస్టరు వేయాలన్నారు. పనులకు రాని వారి పేర్లపై మస్టర్లు వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట టెక్నికల్ అసిస్టెంట్ మజార్ ఉన్నారు.

నందీశ్వరస్వామికి పరోక్ష సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి అర్చకులు శుక్రవారం విశేషపూజలను నిర్వహించారు. పలువురు భక్తులు పరోక్షసేవగా నందీశ్వరస్వామి పూజను జరిపించుకున్నారు.

యాచకురాలి మృతదేహం అప్పగింత

కోవెలకుంట్ల: కోవెలకుంట్లలో మృతి చెందిన యాచకురాలి మృతదేహాన్ని శుక్రవారం కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ముద్దాస్ పుల్లమ్మ(60) కొన్ని నెలల నుంచి స్థానిక పాండురంగస్వామి దేవాలయ సమీపంలో భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. రాత్రి సమయాల్లో గుడి పరిసర ప్రాంతాల్లో నిద్రించేది. కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ కోలుకోలేక శుక్రవారం మృత్యువాత పడింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వివరాలు ఆరా తీయగా మృతురాలిది ఆళ్లగడ్డ నియోజకవర్గం రుద్రవరం మండలం రెడ్డిపల్లెగా గుర్తించారు. మృతురాలి కుమారుడికి సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు కోవెలకుంట్లకు వచ్చి మృతదేహాన్ని తీసుకెళ్లినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సన్మానం



నేషనల్ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా జేసీ చేతులు మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్న మండల పరిషత్ సూపరింటెండెంట్ సయ్యద్‌ఉమర్, పంచాయతీ కార్యదర్శి జగజీవన్‌లను శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఎంపీడీఓ కె.వి.సుబ్రహ్మణ్యం, డిప్యూటీ ఎంపీడీఓ కె.బాలునాయక్ సన్మానించారు.

– ఆత్మకూరు

బాల్య వివాహాలను అరికడదాం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ బేబి

నందికొట్కూరు: బాల్య వివాహాలను అరికట్టే బాధ్యత అందరిపై ఉందని జిల్లా బాలల సంరక్షణ అధికారిణి స్వప్నప్రియదర్శిని, మున్సిపల్ కమిషనర్ బేబి తెలిపారు. శుక్రవారం ఎమ్మార్సీ ట్రైనింగ్ సెంటర్‌లో బాల్య వివాహాల నిర్మూలనపై జరిగిన సమన్వయ సమావేశం వారు మాట్లాడారు. మహిళా పోలీసులు, మెప్మా అధికారులు, సిబ్బంది, వీఆర్వోలు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, స్కూల్ టీచర్లు బాల్య వివాహాలపై, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



జూపాడుబంగ్లా మండలం కనకయ్య కొట్టాల జెడ్పీహెచ్ స్కూల్‌లో శుక్రవారం 1999–2000 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు సమావేశమయ్యారు. 25 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకుని ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వారికి విద్య నేర్పిన గురువుల ఆశీర్వాదాలు తీసుకుని శాలువా పూలమాలలతో సత్కరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆనందోత్సవాల మధ్య గడిపారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లుగా రవికుమార్, భాస్కర్, పరమేశ్వరుడు, రాము తదితరులు వ్యవహరించారు.

– జూపాడుబంగ్లా